# ముగిసిన పోలింగ్

- జిల్లాలో 75.92 శాతం నమోదు
- పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ పోరు ఆఖరి అంకం సమాప్తమైంది. గురువారం జిల్లా వ్యాప్తంగా రెండు నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకే ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7గంటలకు వరకు కొనసాగింది. మధ్యాహ్నం 2గంటల వరకు మందకొడిగా వచ్చిన ఓటర్లు తర్వాత ఒక్కసారి పెద్ద సంఖ్యలో బూత్‌ల వద్దకు చేరుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో 5గంటల లోపు వచ్చిన ఓటర్లు బారులు తీరడంతో అందరూ ఓటు హక్కు వినియోగించుకునే వరకు కొనసాగించారు. ఆ తర్వాత పోలింగ్ స్టేషన్లకు వచ్చిన కొందరు అభ్యర్థులను అధికారులు లోనికి అనుమతించలేదు. ఉదయం 7నుంచి 9గంటల వరకు సిరిసిల్ల నియోజకవర్గంలో 9.8, వేములవాడ నియోజకవర్గంలో 10.71శాతం నమోదైంది. పోలింగ్ సందర్భంగా దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించారు. కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా టెంట్లు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ ప్రాథమిక శిబిరాలు ప్రతి బూత్‌లో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 4,66,677 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 75.92 పోలింగ్ శాతం నమోదైంది. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,44,426 మంది ఓటర్లు ఉన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 2,22,251 మంది ఓటర్లు ఉన్నారు. కాగా సిరిసిల్ల నియోజకవర్గంలో 21మంది, వేములవాడలో 16మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. వారి భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తమై ఉన్నది. ఈ నెల 3న ఫలితాలు వెల్లడికానున్నాయి.

### సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతం

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వంద సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఆ ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మోహరించాయి. ఎక్కడా కూడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. వాటి స్థానంలో మరో ఈవీఎంలను ఏర్పాటు చేసిన ఓటర్లకు ఇబ్బందులకు లేకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఉదయం ఏడు గంటలకు ఠంచనుగా ఓటింగ్‌ను ప్రారంభించారు. బూత్‌లోకి సెల్‌ఫోన్లను అనుమతించలేదు. ఓటు వేయడానికి వచ్చిన ప్రతి ఓటరు గుర్తింపు కార్డును నిశితంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వివిధ పార్టీల కార్యకర్తలను రానివ్వలేదు. వంద మీటర్ల దూరంలోనే ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు.



రుద్రంగిలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు



సుందరయ్యనగర్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు స్లిప్పలను అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది

### స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు తరలింపు

పోలింగ్ ముగియగానే సిబ్బంది తమకు కేటాయించిన బస్సులలో సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అధికారులకు అందజేశారు. అక్కడి నుంచి వాటిని పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సులలో తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు అందులోనే భద్రపర్చారు.

### స్వగ్రామాలకు చేరుకున్న పట్టణ వాసులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం సంతరించుకున్నది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా వెళ్లిన వారంతా స్వగ్రామాలకు తిరిగివచ్చారు. ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు కార్లలో, బస్సుల్లో వచ్చిన వారితో పల్లెల్లో సంక్రాంతి పండగను తలపించింది. వచ్చిన వారితో కుటుంబ సభ్యులంతా కలిసి కట్టుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా అందరం కలుసుకునే అవకాశం కలిగిందంటూ సంతోషం వ్యక్తం చేశారు. చాలా రోజుల తర్వాత పట్టణ వాసులంతా గ్రామాలకు రావడంతో తమ బంధువులు, స్నేహితులను కలుసుకుంటూ ఆప్యాయంగా ఒకరి నొకరు పలుకరించుకుంటూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. రచ్చబండ వద్ద పలువురు ముచ్చటించుకోవడం కనిపించింది.

### ఉత్సాహం చూపించిన యువత

అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఓటెత్తింది. జిల్లాలో సుమారు 40వేల మంది యువత కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందరు 18సంవత్సరాలలోని యువతీ, యువకులే. మొదటిసారి ఓటు వేయడం సంతోషంగా ఉందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏ పోలింగ్ బూతులోకెళ్లినా ఓటు వేయడానికి ఉత్సాహం చూపారు. ఉదయం 9గంటల నుంచే కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలలో ఎన్నికల పండుగ వాతావరణం నెలకొన్నది. ఆర్టీసీ అధిక శాతం బస్సులను ఎన్నికల విధులకే కేటాయించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు కొన్ని బస్సులను మాత్రమే నడిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్థానిక ఓటర్లంతా ప్రైవేట్ వాహనాల్లో స్వగ్రామాలకు తరలివచ్చారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం రెండు రోజులు సెలవు ప్రకటించింది. సెలవు రోజులు సొంతూరిలో అందరితో సరదాగా గడిపే అవకాశం లభించేలా ఎన్నికలు కలిసివచ్చాయి.

### మూడంచెల భద్రత: ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబర్30: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసియాని, ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరకుగుండా పోలింగ్ జరిగిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం పోలింగ్ ముగిసిన అనంతరం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీయంలను పటిష్ఠ బందోబస్తు మధ్య తరలించారు. స్ట్రాంగ్ రూంలకు ఈవీయం తరలింపును ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

### దివ్యాంగులు, వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టరేట్, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన దివ్యాంగులు వయోవృద్ధులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్‌ఛైర్, ర్యాంప్ ఏర్పాటు చేసింది. వారు పోలింగ్ కేంద్రానికి వచ్చిన వెంటనే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీల్‌ఛైర్‌లో సహాయకులు వారిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. వారు ఓటు వేసిన అనంతరం తిరిగి వారిని తాము వెళ్లే వాహనం వద్దకు వీల్‌ఛైర్‌లో తీసుకువచ్చారు. ర్యాంపు సౌకర్యం కూడా కల్పించారు. అలాగే ఓటర్ల కోసం తాగునీటి వసతి, టెంట్‌లను ఏర్పాటు చేశారు.



సిరిసిల్లలోని రాళ్లబాయి వద్ద గల భారతీయ విద్యా లయన్ పోలింగ్ కేంద్రం నుంచి బద్దెనపల్లిలోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది



రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళలు

# మహిళలే ముందంజ

- వేములవాడ నియోజకవర్గంలో గతంలో కంటే తగ్గిన పోలింగ్
- 78.43శాతం పోలింగ్ నమోదు
- మహిళలు 96,024, పురుషులు 78,280, ఇతరులు 11

వేములవాడ, నవంబర్ 30: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో వేములవాడ నియోజకవర్గం మహిళా ఓటర్లలో చైతన్యం వెల్లువిరిసినట్లుగా తెలుస్తుంది. గురువారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని బారులు తీరగా నియోజకవర్గంలో 78.43శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. ఇక వేములవాడ నియోజకవర్గంలో 2,22,251 ఓటర్లు ఉండగా 1,74,315 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 96,024 మహిళలు, 78,280 పురుషులు, ఇతరులు 11మంది ఓటుహక్కును సద్వినియో గం చేసుకున్నారు. ఇక నియోజకవర్గంలోని మహిళల ఓట్లు 1,15,331 ఉండగా 83.5శాతం తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని మహిళలు ఆదర్శంగా నిలిచారు. ఇక పురుషుల ఓట్లు 1,06,890 ఉండగా కేవలం 73.3శాతం మాత్రమే తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో 80.96శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుత ఎన్నికలతో పోలిస్తే 2.53శాతం తగ్గినట్లుగా అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందులో మహిళ ఓటర్లలో మాత్రమే చైతన్యం కనిపించింది. ఇక ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలిరాగా సాయంత్రం పోలింగ్ సమయం 5గంటలు ముగిశాక కూడా దాదాపు నియోజకవర్గంలోని 10కి పైగా పోలింగ్ కేంద్రాల్లో మరో గంటన్నర సేపు పోలింగ్ కొనసాగినట్లు అధికారులు వెల్లడించారు. కాగా నియోజకవర్గంలో 18వేల యువ ఓటర్లు ఓటుహక్కును నమోదు చేసుకోగా, భారీ సంఖ్యలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.



వేములవాడ రూరల్: నూకలమర్రిలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

### పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు

పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలోని 182 బూత్‌లలో ఈవీఎం మొరాయింపులతో 40నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. వేములవాడ రూర్ మండల ఫాజుల్‌నగర్‌లోను 147బూత్‌లో ఈవీఎం మొరాయింపుతో పోలింగ్ ఆలస్యంగా సాగింది. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ మండల పరిషత్ బూత్‌లోను పోలింగ్ సరళి జాప్యంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.